యాభై ఏళ్లుగా అద్దె భవనంలోనే..

- ఇరుకు గదిలో పోస్టాఫీస్ నిర్వహణ
- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు, సిబ్బంది


ఇరుకు గదిలో కొనసాగుతున్న పిట్లం సబ్ పోస్టాఫీస్

పిట్లం(జుక్కల్): పిట్లం సబ్ పోస్టాఫీస్ గత 50 ఏళ్లగా అద్దె భవనంలోనే కొనసాగుతుంది. కొన్ని సంవత్సరాలుగా ఒక చోట నుంచి మరో చోటకు మారుతూ ఉంది. ప్రస్తుతం ఇరుకుగా ఉన్న ఒకే షట్టర్‌లో కొనసాగుతోంది. దీంతో పోస్ట్ ఆఫీస్‌కు వచ్చే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇరుకుగా ఉన్న ఒకే షట్టర్‌లో పోస్టాఫీస్ నిర్వహిస్తుండటంతో పెన్షన్, ఉపాధి హామీ డబ్బుల కోసం వచ్చే లబ్ధిదారులు ఎండకూ, వానకూ పోస్ట్ ఆఫీస్ బయటే ఉండాల్సి వస్తోంది. దీంతో పాటు పోస్ట్ ఆఫీస్‌లో జనరేటర్ ఉన్నా పని చేయడం లేదు. కరెంటు లేక పోతే వచ్చేంత వరకు లబ్ధిదారులు బయటే వేచి ఉండాల్సి వస్తోంది. పిట్లం సబ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలోని చిల్లర్గి, అన్నారం, తిమ్మనగర్, గౌడ్మెగాం, చిన్నకొడప్‌గల్, పెదకొడప్‌గల్, కాటేపల్లి, కాస్లాబాద్ గ్రామాలలోని మొత్తం 8 బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లు కూడ అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయి. బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లలో సైతం ఇదే పరిస్థితి ఉంది. దీని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సబ్ పోస్ట్ ఆఫీస్, బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లలో మొత్తం సుమారు 6,500 మంది పెన్షన్ తీసుకునే వారు ఉన్నారు. వారు ప్రతి నెలా రూ.1 కోటి 80 లక్షల పెన్షన్ తీసుకుంటారు. అదే విధంగా సుమారు 10 వేల మంది ఉపాధి హామీ కార్మికులు ఉన్నారు. వారు ఉపాధి హామీ డబ్బులు రూ. 60 లక్షల తీసుకుంటారు. ఇంతే కాకుండా పీఎం కిసాన్‌తో పాటు పంటల డబ్బులు రైతులు సబ్ పోస్ట్ ఆఫీస్, బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లకు వచ్చి తీసుకుంటారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సబ్ పోస్ట్ ఆఫీస్, బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లను అన్ని సౌకర్యాలతో పక్కా ప్రభుత్వ భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇరుకుగా ఉంది



పిట్లం సబ్ పోస్ట్ ఆఫీస్ అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇరుకు గదిలో నిర్వహిస్తున్నారు. ఏదైనా పనిపై సబ్ పోస్ట్ ఆఫీస్‌కు వెళ్తే ఆఫీస్‌లో కనీసం కూర్చొలేని పరిస్థితి ఉంది. బయట నిలబడి బయట నుంచే పని చేసుకొని రావాల్సి వస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అన్ని వసతులతో కూడిన నూతన భవనం నిర్మిస్తే బాగుంటుంది.

– లోక మనోహర్, పిట్లం

ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం



రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు సంబంధించిన చాలా పథకాలు సబ్ పోస్ట్ ఆఫీస్‌కు అనుబంధంగా ఉండటంతో ప్రతి రోజు ఎక్కువ మంది సబ్ పోస్ట్ ఆఫీస్‌కు వస్తుంటారు. పిట్లం సబ్ పోస్ట్ ఆఫీస్ కోసం నూతన భవనం మంజూరు చేసి నిర్మించాలని ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం.

– లింగ్ గౌండ, సబ్ పోస్ట్ మాస్టర్, పిట్లం

గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలి


పిట్లంలో కాంగ్రెస్ బాకీ కార్డులను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే


బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నేతలు

- మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే

పిట్లం(జుక్కల్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సాయి గార్డెన్‌లో బుధవారం బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయడంలో విఫలమైందని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల కంటే ఎక్కువగా సంక్షేమ పథకాలను అమలు చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఇచ్చిన హామీలను కూడా అమలు చేయడం లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో వేసిన రోడ్లకు ఇప్పటి ప్రభుత్వం కనీసం ప్యాచ్ వర్క్ చేయడం లేదని విమర్శించారు. ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణిని ప్రజలకు వివరిస్తూ, ప్రచారం చేయాలని, తప్పకుండా స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి కాంగ్రెస్ బాకీ కార్డులను విడుదల చేశారు. ఆ తర్వాత పోచారం తండాకు చెందిన మాజీ సర్పంచ్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి హన్మంత్ సింధే, బీఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదర్ రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం


తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ సామగ్రిని సిద్ధం చేస్తున్న అధికారులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామని ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ అన్నారు. తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎన్నికల సామగ్రిని సిద్ధం చేసిన అనంతరం మాట్లాడారు. ఎన్నికల నిబంధనల ప్రకారం సజావుగా జరిగేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని సదుపాయాలు ఉన్నాయో లేవో ముందుగా తెలుసుకోవాలని సూచించారు. ఏవో నర్సింలు, ఎంఈవో రామస్వామి, ఎంపీవో సవిత, సీనియర్ అసిస్టెంట్ హన్మాండ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

బీబీపేట: మండలంలోని 8 ఎంపీటీసీ స్థానాలకు, జెడ్పీటీసీ స్థానానికి నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ ఉంటుందని ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ తెలిపారు. జెడ్పీటీసీ స్థానానికి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో స్వీకరణ ఉంటుందని తెలిపారు. అలాగే మాందాపూర్, జనగామ, ఇస్సానగర్, తుజాల్‌పూర్, యాడారం ఎంపీటీసీ స్థానాలకు మండల కేంద్రంలోని ఇందిరమ్మ మోడల్ హౌజ్‌లో స్వీకరణ ఉంటుందని, బీబీపేట 1, 2, 3 స్థానాలకు బీబీపేట గ్రామ పంచాయతీలో స్వీకరిస్తామని తెలిపారు.

భిక్కనూరు: మండలంలోని 14 ఎంపీటీసీలకు, జెడ్పీటీసీ స్థానానికి గురువారం నుంచి శనివారం వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు భిక్కనూరు ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఎంపీటీసీ స్థానాలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో, జడ్పీటీసీ స్థానానికి మహిళ సమాఖ్య కార్యాలయ సమావేశ మందిరంలో నామినేషన్లను స్వీకరిస్తామని ఆయన వివరించారు.

'భూ కబ్జాలపై విచారణ జరిపిస్తున్నాం'

సాక్షి ఎఫెక్ట్..

రామారెడ్డి: అధికారుల నిర్లక్ష్యం – కబ్జాదారులకు వరం అనే శీర్షికన బుధవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనంపై రామారెడ్డి తహసీల్దార్ ఉమాలత స్పందించారు. ఆర్ఐ, సర్వేయర్‌తో కలిసి అసైన్మెంట్ భూముల కబ్జాలకు సంబంధించి విచారణ జరిపిస్తున్నామని, కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దేవునిపల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడిగా స్వామి

మాచారెడ్డి: పాల్వంచ మండలం మంథని దేవునిపల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడిగా నాయిని స్వామిని నియమించినట్లు బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు రాజాగౌడ్ బుధవారం తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా బాల్‌రాజును నియమించామన్నారు. ఈ సందర్భంగా రాజగౌడ్ మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని పిలుపునిచ్చారు.

వరి కోతలు షురూ.!



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి, మంగ్లూర్, మాగి గ్రామాల పరిధిలో వరి పంటలు కోతకు రావడంతో యంత్రాల ద్వారా పంట నూర్పిడులు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల నుంచి వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టడంతో కోతలపై రైతులు దృష్టి సారించారు. పంటపొలాల్లో నీళ్లు నిల్వ ఉండటంతో చైన్ యంత్రాల సాయంతో కోతలు చేపడుతున్నారు.

పెద్దకొడప్‌గల్ పరిధిలో సోయా కోతలు..



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలో సోయా కోతలు జోరుగా సాగుతున్నాయి. అయితే భారీ వర్షాల కారణంగా దిగుబడి తగ్గడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. సాధారణంగా ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, ఈ సారి 5 నుంచి 6 క్వింటాళ్ల మాత్రమే వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. వర్షాల వల్ల సోయా మొక్కలపైనే మొలకలు వచ్చి నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కళాబృందం ప్రదర్శనలు



గాంధారి(ఎల్లారెడ్డి): కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, డీపీఆర్‌వో ఆదేశాల మేరకు బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో తెలంగాణ సాంస్కృతిక కళాబృందం సభ్యులు ప్రదర్శనలు ఇచ్చినట్లు ఎస్పై ఆంజనేయులు తెలిపారు. విద్యార్థులకు మాదకద్రవ్యాలు, రోడ్డు భద్రత, ఓటు ఆవశ్యకత తదితర విషయాలపై కళాప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. కళాబృందం సభ్యులు రమేష్ రావు, విఠల్ రెడ్డి, రామ చంద్రం, తిరుపతి, లక్ష్మీనారాయణ, పోశెట్టి, మహేందర్, దివ్య, నాగరాజు, వనిత, లత, నరేష్, శిల్ప, కాశిరాం ప్రదర్శనలిచ్చారు. ప్రిన్సిపాల్ గడ్డం గంగారాం, కాలేజీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక


బీర్కూర్‌లో నిర్వహించిన ఎంపిక పోటీలకు హాజరైన క్రీడాకారులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మాధవరావు, ఉపాధ్యాయులు

బాన్సువాడ : ఈ నెలలో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ కోసం బుధవారం బీర్కూర్ మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే విద్యాలయంలో క్రీడాకారులను ఎంపిక చేశారు. నెట్‌బాల్‌లో అత్యుత్తమ ప్రదర్శన చూపిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి రఘురామ్ తెలిపారు. మండల విద్యాధికారి వెంకట్, పాఠశాల ప్రిన్సిపల్ శివకుమార్, పీఈటీలు సబత్, సిద్దు, అమీర్, గోపాల్, బస్వరాజ్, నవీన్ తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు నస్రుల్లాబాద్ విద్యార్థులు

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో గల గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మాధవ రావు తెలిపారు.

ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. మంగళవారం కామారెడ్డి గవర్నమెంట్ జూనియర్ కాలేజ్‌లో ఎంపికలు జరిగాయని తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు సత్య, కళ్యాణ్ ఉత్తమ ప్రతిభ కనబరిచారని, వీరు నిజామాబాద్ జిల్లా తరపున ఈ నెల 10 నుంచి 12 వరకు మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొననున్నారని చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ రాహుల్, పోశెట్టి, పీఈటీలు ప్రవీణ్, అశ్విన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి గుంట భూమికి నష్ట పరిహారం చెల్లించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న ప్రతి గుంటకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తహసీల్దార్ సత్యనారాయణకు భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీకేఎస్ అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి మాట్లాడుతూ.. పంటకు జరిగిన నష్ట పరిహారాన్ని ప్రభుత్వం నుంచి వ్యవసాయ అధికారులు వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. ప్రతినిధులు నారాయణ రెడ్డి, మనోహర్‌రెడ్డి, కోతి లింబారెడ్డి, సంకరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా మర్కల్–తిర్మన్‌పల్లి రోడ్డు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మర్కల్–తిర్మన్‌పల్లి బీటీ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు గుండా ప్రతి రోజు పరిమితికి మించిన లోడ్‌లతో కూడిన లారీలు రాకపోకలు సాగిస్తుండటం వల్ల రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ధ్వంసమైన బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్లాస్టిక్ వాడకం వల్ల వ్యాధుల ప్రమాదం


స్టీల్ వాటర్ బాటిళ్లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్యుడు

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్లాస్టిక్ వస్తువులు, కవర్ల వాడకం వల్ల క్యాన్సర్‌తో పాటు చర్మ వ్యాధులు, ఇతర సమస్యలు వస్తున్నాయని డీఎల్‌పీవో సురేందర్ అన్నారు. బుధవారం నల్లమడుగు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎల్‌పీవో సురేందర్ పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్‌ను వాడబోమని విద్యార్థులు తీర్మానం చేయడంతో వారిని ఆయన అభినందించారు. కామారెడ్డికి చెందిన ప్రముఖ హోమియోపతి వైద్యుడు రవీందర్ విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ వితరణ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం కోటేశ్వర్‌రావు, పాఠశాల హెచ్‌ఎం ఎమిలియా, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులను సరిచేయాలి



మద్నూర్(జుక్కల్): ఓటరు జాబితాలో తప్పులను సరిచేయాలని మద్నూర్ మాజీ ఎంపీటీసీ రాములు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల కమిషన్ తుది ఓటర్ల జాబితా విడుదల చేసిందని, ఓటరు జాబితాలో మృతి చెందిన ఓటర్ల పేర్లు ఉన్నాయని తెలిపారు. అలాగే ఒక ఓటరు పేరు మూడు సార్లు జాబితాలో ఉందని తెలిపారు. అధికారులు నిర్లక్ష్యంగా పని చేయడంతో ఇలా జరిగిందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు ఓటరు జాబితాను సవరించి ఎన్నికలు నిర్వహించాలని లేకుంటే కోర్టుకు వెళ్తానని హెచ్చరించారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలని వినతి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రం గోపాల్‌పేటలోని సుభాష్‌చంద్రబోస్ కాలనీలో ఇళ్ల మధ్య కొనసాగుతున్న మద్యం దుకాణాన్ని తొలగించాలని కోరుతూ బుధవారం కాలనీవాసులు జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఇళ్ల మధ్య మద్యం దుకాణం ఉండటం వల్ల కాలనీవాసులతోపాటు మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు చెప్పారు. అక్కడి నుంచి తొలగించి మరో చోటుకు మార్చాలని వారు కోరారు.

ఆధార్ అప్‌డేట్‌కు తప్పని తిప్పలు


దోమకొండలోని ఆధార్ కేంద్రం వద్ద బారులు తీరిన జనం

దోమకొండ: ఆధార్ కార్డులో అప్‌డేట్ కోసం ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. దోమకొండ మండల కేంద్రంలోని ఆధార్ కేంద్రం వద్ద బుధవారం జనం గంటల తరబడి వేచి ఉన్నారు. ఆధార్ కార్డులో రాష్ట్రం పేరు ఆంధ్రప్రదేశ్‌కు బదులుగా తెలంగాణ అని అప్‌డేట్ చేసుకోవడానికి మీ–సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మండల కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి జనం వస్తున్నారు. సర్వర్ సమస్య కారణంగా ఆధార్ అప్‌డేట్ ఆలస్యం అవుతుందని మీ–సేవ నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో ఇక్కడికి వచ్చిన జనం గంటల తరబడి అక్కడే వేచి ఉంటున్నారు. అధికారులు స్పందించి సర్వర్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ



లింగంపేట(ఎల్లారెడ్డి): కొర్పోల్, నాగారం ప్రాథమిక పాఠశాలలను బుధవారం మండల విద్యాధికారి షౌకత్‌అలీ తనిఖీ చేశారు. విద్యార్థులకు అర్థమయ్యేలా సులభ పద్ధతిలో విద్యా బోధన జరగాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల రికార్డు అప్‌డేట్‌గా ఉంచాలని ఆదేశించారు. రిపోర్టులు ఎమ్మార్సీకి సకాలంలో అందజేయాలని సూచించారు. హాజరు పట్టికలను పరిశీలించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, సీఆర్పీలు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్

సదాశివనగర్ (ఎల్లారెడ్డి): కుప్రియల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నేత ఏలేటి భూమిరెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుంచి తొలగించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా వ్యవహరించినందుకు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన ఎవరైనా సరే పార్టీ నుంచి తొలగిస్తామని ఆయన పేర్కొన్నారు. నాయకులు లింగ గౌడ్, రూపేందర్ రెడ్డి, సంగ్యా నాయక్, తిమ్మజాడ సాయిలు, పొన్న దేవేందర్, బత్తుల రాములు, గణేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ పట్టా అందుకున్న గిరిజన యువతి



బాన్సువాడ రూరల్: మండలంలోని తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న అంజనీ బాయి అనే గిరిజన యువతి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. వివరాలు.. నస్రుల్లాబాద్ మండలం అంకోల్‌తండాకు చెందిన వసంత్‌రావు, అంబికల కుమార్తె అంజనీబాయి హైద్రాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయం నుంచి సింగరేణి కథ సాహిత్యం– కార్మిక జీవన చిత్రణ అనే అంశంపై పరిశోధన చేపట్టారు. కాగా ఈనెల 7న హెచ్‌సీయూ 25వ స్నాతకోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో గవర్నర్ విష్ణుదేవ్ వర్మ, వైస్ చాన్సలర్ బీజేరావు చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. దీంతో ఆమెను గ్రామస్తులు, గిరిజన నాయకులు అభినందించారు.

అందుబాటులో శనగ విత్తనాలు

బిచ్కుంద(జుక్కల్): టీఎస్ సీడ్స్ శనగ విత్తనాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు తీసుకెళ్లవచ్చని సహకార సంఘం చైర్మన్ నాల్చర్ బాలు సూచించారు. మండల కేంద్రంలోని సొసైటీలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన, సరసమైన ధరలతో శనగ విత్తనాలు, టార్పాలిన్లు ఉన్నాయన్నారు. శనగ విత్తనాలు జాకీ918(25కిలోల) రూ.2,085, టార్పాలిన్(18బై18) రూ.1,450, టార్పాలిన్(24బై30) రూ.2300 చెల్లించి తీసుకోవాలన్నారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించండి



కామారెడ్డి టౌన్: జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్. వెంకట్ రాములు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సీపీఎం పోటీ చేయని స్థానాలలో లౌకిక, ప్రజాస్వామిక వాదులకు మద్దతు ఉంటుందన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సీపీఎంను ఆదరించాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు వెంకట్‌గౌడ్, మోతిరాం, రేణుక, నర్సింలు, రవీందర్, అరుణ్‌కుమార్ తదితరులున్నారు.

ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): సర్పంచ్ పదవిని ఎస్సీ రిజర్వ్ చేయాలని శెట్పల్లి గ్రామానికి చెందిన అంబేడ్కర్ సంఘం సభ్యులు బుధవారం ఎంపీడీవో నరేష్, ఆర్డీవో పార్థసింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. 70 ఏళ్లగా సర్పంచ్ ఎస్సీ రిజర్వేషన్ రాకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం సభ్యులు తోట సాయిలు, పరంధాములు, మన్నె చిన్న బాలయ్య, శంకర్, రాజయ్య, సాయిలు, రాములు, సాయికుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల కోసం బుధవారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. వైద్యురాలు సారిక దివ్యాంగ చిన్నారులకు పరీక్షలు చేశారు. చిన్నారులకు ఇంటి వద్ద చేసే వ్యాయామం గురించి ఆమె.. విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఐఈఆర్‌పీ కమల్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

లింగంపేట(ఎల్లారెడ్డి): పొల్కంపేట గ్రామానికి చెందిన మేదరి లక్ష్మి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. మృతురాలు లక్ష్మి కొడుకు మేదరి అనిల్‌కు తోటి స్నేహితులు బుధవారం రూ. 4 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మోహిద్, రామగౌడ్, శ్రావణ్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీర్కూర్‌లో డయాబెటిక్ క్యాంపు



బాన్సువాడ : బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో డయాబెటిక్ క్యాంపు నిర్వహించారు. లయన్ స్టిక్ ఇయర్(2025–26) లయన్స్ గవర్నర్ ఆదేశాల మేరకు లయన్ అమర్నాథ్ సూచనలతో బీర్కూర్‌లో 100 రోజుల సేవ కార్యక్రమాలు పూర్తి చేసుకున్నారు. అందులో భాగంగా డయాబెటిక్ క్యాంపు నిర్వహించారు. వైద్యులు సితాలే రమేష్ రోగులకు చికిత్సలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు రమేష్, సభ్యులు మేకల విఠల్, గాలయ్య, కొట్టూరి సంతోష్, రషీద్ ఉన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత



పిట్లం(జుక్కల్): అన్నారం గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నిరుపేద కుటుంబానికి చెందిన వడ్డే దుర్గవ్వకు 25 కిలోల బియ్యం, దుస్తులు, నెలకు సరిపడా కిరాణా వస్తువులు, నిత్యావసర సరుకులు అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నారాయణ, రీజియన్ కో–ఆర్డినేటర్ వేణు గోపాల్, లక్ష్మీనారాయణ, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

లింగంపేట(ఎల్లారెడ్డి): ఎక్కపల్లి గ్రామానికి చెందిన పలువురు బుధవారం టీడీపీలో చేరారు. వారికి పార్టీ మండల అధ్యక్షుడు భీమ్‌రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు విశ్వేశ్వర్‌శర్మ, కృష్ణ, తిరుపతి, జగ్యానాయక్, కిషన్, సాయిలు, నంద్యానాయక్, రాములు పాల్గొన్నారు.